క్లుప్తంగా

ఉరుకుందకు తరలివచ్చిన భక్తులు



ఈరన్నస్వామి ఆలయంలో భక్తుల సందడి

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు. భక్తుల రాకతో క్షేత్ర పరిసరాలు కిటకిటలాడాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. పలువురు భక్తులు మొక్కు చెల్లింపులో భాగంగా ఆలయ పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.

రాజగోపురానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు రూ.1,00,001 విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఎమ్మిగనూరుకు చెందిన విజయ్ తన తల్లి ఉప్పర ఉలిగమ్మ జ్ఞాపకార్థం ఆ మొత్తాన్ని దేవస్థాన కార్యాలయంలో అధికారులకు అందజేశారు. అలాగే శాశ్వత అన్నదానం పథకానికి రూ.11,110 అందజేసినట్లు చెప్పారు. దాతకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి ప్రసాదం, పూలమాల, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

తక్షణ సాయం అందజేత

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని పాతవూరులో నివాసముంటున్న ఆకుల గురు రాజా అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం కింద మృతుడి భార్య సరోజకు తక్షణ సాయంగా రూ. 10వేలు అందజేశారు. మిగిలిన సొమ్ము నామిని బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని చెప్పారు.వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రకాష్, వలంటీర్ రామాంజి ఉన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఆదోని టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఆస్తి పన్ను, నీటి సరఫరాలో వేళలు పాటించాలని, వీధిలైట్లు వెలగడంలేదని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలపై సంబంధిత సెక్షన్ అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఆర్ఓ, టీపీఓ, ఇంజినీరింగ్ సెక్షన్, ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తనీయం

కౌతాళం: గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేస్తామని బాపురం గ్రామ సర్పంచ్ శిల్పా రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. అలాగే ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించి, పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, నిర్ణీత కూలి లభించేలా పనులు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఉప సర్పంచ్ రామాంజనేయులు, కార్యదర్శి అబ్దుల్, సచివాలయ కన్వీనర్ జైపాల్, మహిళ పోలీస్, జూనియర్ లైన్‌మ్యాన్, నాయకులు గురునాథ్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే గేటు సమస్య పరిష్కరించాలి

కోసిగి: మండల కేంద్రంలో రైల్వే గేటు సమస్యను పరిష్కరించాలని సీపీఎం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాముడు, వీరేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ చెన్నై-ముంబయి ప్రధాన రైల్వే మార్గం కావడంతో రైళ్ల రాకపోకలు పెరిగిపోవడంతో రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేస్తున్నారు. గంట సమయంలో రెండు నుంచి మూడు సార్లు గేటు వేస్తుండటం, ఒక సారి గేటు పడితే 20 నిముషాలకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే దారిలో ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం, ఖాదర్‌లింగా స్వామి దర్గాకు భక్తులు వెళ్లే వాహనాలతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు.

మహిళ..మహాలక్ష్మిగా

- మున్సిపాలిటీలో పరిపుష్టి సాధించిన పొదుపు సంఘాలు
- వ్యాపారాలతో లక్షాధికారులైన మహిళలు
- బాబు హయాంలో సంఘాలు నిర్వీర్యం
- రుణాల చెల్లింపులో ఆదోని గ్రూపులు ఆదర్శం





చందాసా దర్గా వద్ద పండ్ల వ్యాపారం చేస్తున్న వసుంధర గ్రూపు సభ్యురాలు శాంతి, మండిగిరిలో పండ్ల వ్యాపారం చేస్తున్న శివశక్తి సంఘం సభ్యురాలు కవిత

ఆదోని టౌన్: టీడీపీ హయాంలో నిర్వీర్యమైన పొదుపు సంఘాలు వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్థిక పరిపుష్టి సాధించాయి. బ్యాంకుల్లో పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తుండడంతో సంఘాలకు బ్యాంకులు అధికంగా రుణాలు ఇస్తున్నాయి. దీంతో అధిక శాతం మహిళలు సొంతంగా వృత్తులు నిర్వహించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. రుణాలతో వివిధ రకాల చిరువ్యాపారాలు, హోటళ్లు, కూరగాయల వ్యాపారం చేస్తూ రాణిస్తున్నారు. ఆదోని మున్సిపాలిటీలోని పొదుపు సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా దాదాపు రూ.వంద కోట్లు రుణాలు తీసుకొని తిరిగి చెల్లించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచాయి

1995లో సంఘాల ఏర్పాటు

ఆదోని మున్సిపాలిటీలో 1995లో 315 సంఘాలు ఏర్పాటయ్యాయి. 2005-06 వరకు ఒక్క గ్రూపు కూడా పెరగలేదు. 2006-07లో వైఎస్సార్ పాలనలో 1,100 గ్రూపులు ఏర్పడ్డాయి. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు రుణ సౌకర్యం పొందారు. మహిళలు చిరు వ్యాపారాలు, కూరగాయలు, బట్టల వ్యాపారం, సబ్బులు, సర్ఫ్ తయారీ, హోటళ్లు, బుట్టల తయారీ, కుట్టుమిషన్లు, స్టీల్ సామన్లు, ప్లాస్టిక్ బిందెల తయారీ, అమ్మడం, అగరబత్తీలు, మగ్గం ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

2010-11లో..

➡ ఆదోని మున్సిపాలిటీలో 2010-11లో 1,700 పొదుపు సంఘాలు ఏర్పడ్డాయి. లింకేజీ ద్వారా రూ.12 కోట్లు రుణ సౌకర్యం పొందారు.

➡ 2014-15లో చంద్రబాబు నాయుడు పాలనలో ఒక్క సంఘం కూడా నూతనంగా ఏర్పాటు కాలేదు. రుణ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. మహిళలు అధిక వడ్డీలకు అప్పులు చేసి తీర్చలేక పలువురు అఘాయిత్యాలకు పాల్పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 30 మంది వరకు అధిక వడ్డీలకు బలయ్యారు.

➡ 2019-20లో 1,100 ఉన్న గ్రూపులు ఏకంగా 1439కి పెరిగాయి. అందులో 927 గ్రూపులకు రూ. 37.81 కోట్లు రుణం అందజేశారు.

➡ 2020-21లో 401 గ్రూపులు రూ.40.87 కోట్లు రుణసాయం పొందారు.

➡ 2021-22లో 799 గ్రూపులకు రూ.62.90 కోట్లు విడుదలయ్యాయి.

➡ 2022-23లో 899 సంఘాలకు రూ.45.44 కోట్లు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సాయం పొందారు.

వైఎస్సార్ ఆసరా పథకం కింద..

వైఎస్సార్ ఆసరా పథకం కింద 2019లో 1,607 గ్రూపులకు రూ.37.63 కోట్లు, 2020-21కి గానూ రూ.9.29 కోట్లు, 2021-22లో రూ.9.32 కోట్లు, 2022-23లో రూ.9.17 కోట్లు రుణసాయం పొందారు.

వైఎస్సార్ సున్నావడ్డీ కింద..

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 2019-20లో 1,897 గ్రూపులకు గానూ రూ.2.37 కోట్లు, 2020-21లో 2,033 గ్రూపులకు రూ.1.93 కోట్లు, 2021-22లో 1,780 గ్రూపులకు గానూ రూ.1.90 కోట్లు రుణసాయం అందజేశారు.

జగనన్న తోడు పథకం కింద..

2019-20లో 3,430 మందిలో 1481 మందిని అర్హులుగా గుర్తించగా రూ.47.74 కోట్లు రుణం పొందారు. 2020-21లో 355 మందికి గానూ 2,445 మందికి రూ.2.44 కోట్లు, 2021-22లో 1260 మందికి గానూ 817 మందికి రూ.8.17 కోట్లు, 2022-23లో 1,543 మంది సభ్యులకు గానూ 692 మంది రూ.69.20 కోట్లు లబ్ధి పొందారు.

ఇళ్ల నిర్మాణాలకు..

నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకం కింద పట్టణంలోని 42 వార్డుల పరిధిలో 1,951 మంది లబ్ధిదారులకు గ్రూపుల ద్వారా ఒక్కొక్క గ్రూపునకు రూ.35 వేలు చొప్పున రూ.6,82,15,000 రుణ సాయం అందజేశారు.

టిడ్కో ఇళ్లకు..

శిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు 512 మందికి రూ.5.83 కోట్లను మెప్మా ప్రాజెక్టు కింద అందించారు.

బట్టల వ్యాపారం చేస్తున్నా



1996లో పొదుపు సంఘం సభ్యురాలిగా చేరాను. సంఘంలో క్రమం తప్పకుండా పొదుపు చేస్తూ వచ్చాను. సంఘం ద్వారా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలతో ఇంట్లోనే బట్టల వ్యాపారం చేస్తున్నాను. ప్రస్తుతం వ్యాపారంతో బాగా వృద్ధి చెందింది. జగనన్న హయాంలో ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు వరకు రుణాలు ఇస్తున్నారు. ఒక్కొక్క సభ్యురాలు రూ.లక్ష చొప్పున తీసుకుంటున్నాం. ఆ డబ్బుతో వ్యాపారం విస్తరించి లాభాలు గడిస్తున్నా.

– లక్ష్మి, చౌడేశ్వరి గ్రూపు, క్రాంతినగర్

ఆర్థిక ఇబ్బందులు తప్పాయి



పొదుపు సంఘంలో చేరకముందు ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. పొదుపు సంఘంలో చేరిన తర్వాత కాలనీ మహిళలతో కలిసి నెలనెలా పొదుపు చేశాను. బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేయించారు. మగ్గంకు చిన్నచిన్న మరమ్మతులు చేయించి మగ్గం వేస్తూ జీవనం సాగిస్తున్నాం. చేనేతలకు ముడిసరుకు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కొంత సొమ్ము అందజేస్తుంది. ప్రస్తుతం హాయిగా జీవనం సాగిస్తున్నాం.

– అనిత, సాయిసంధ్య పొదుపు గ్రూపు, రాజేరాజేశ్వరినగర్

లోకేష్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్



శ్రీ మఠంలో ప్రదక్షిణ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

మంత్రాలయం రూరల్: నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదని, ఆయన తండ్రి చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఎన్ని హామీలు నెరవేర్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. సోమవారం ఆమె మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, ఆ తర్వాత శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి శ్రీ మఠం అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాలో మంత్రులను, ఎమ్మెల్యేలను తిట్టడమే పనిగా పాదయాత్ర సాగుతోందన్నారు. సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త అర్థం చెప్పిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరికి అధికారం ఇవ్వాలనే విషయంపై ఇప్పటికే ప్రజలకు స్పష్టత ఉందన్నారు. ఏపీలో ఎన్ని పార్టీలు ఒక్కటైనా వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో పోటీ చేసి ప్రభంజనం సృష్టిస్తుందని చెప్పారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



కుప్పగల్‌లో మహిళ సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వేరే ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు ఎత్తివేస్తారని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌ను సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలకు తెలియజేశారు. సోమవారం మండలంలోని కుప్పగల్ గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను తెలుసుకున్నారు. ఎవరైనా అర్హులుండి పథకాలు అందకపోతే సమీపంలో గ్రామ సచివాలయంలో ధ్రువ పత్రాలతో సంప్రదిస్తే అధికారులు విచారించి వర్తింపజేస్తారని చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల ఆశీస్సులు ఉన్నంతవరకు జనాభిమానం ఉన్న జగనన్నకు వచ్చిన ఢోకా ఏమీ లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజాశీర్వాదంతో మళ్లీ సీఎంగా కొనసాగుతారన్నారు. నాలుగేళ్లలో ఏ ప్రభుత్వం చేయనంత అభివృద్ధి చేసి చూపారని కొనియాడారు. ఎమ్మెల్సీ మధుసూదన్, పార్టీ ఆదోని పట్టణ అధ్యక్షులు బి.దేవా, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎంపీడీఓ గీతావాణి, మురళీరెడ్డి, సరపచ్ నాగిరెడ్డి, తిమ్మప్ప, తాయప్ప, నర్సిరెడ్డి, చిన్నారెడ్డి, ఎస్‌ఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ఆదోని అర్బన్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి యేసురత్నం ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు చెలరేగినప్పుడు ఎలా ఆర్పివేయాలి, గ్యాస్ లీకు కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బహుళ అంతస్తుల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు గాయపడిన వారిని రక్షించే పద్ధతులను వివరించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా సిబ్బంది ప్రజలకు తెలియజేశారు. లీడింగ్ ఫైర్‌మెన్లు వెంకటేశ్వర్లు, మహబూబ్‌బేక్, సందీప్‌కుమార్, ఆపరేటర్లు మల్లికార్జునరెడ్డి, మోహన్, ఫైర్‌మెన్లు పంపాపతి, చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు, శంకర్, రాజశేఖర్, హోంగార్డులు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో అడమార్ మఠం పీఠాధిపతి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు ఉడిపిలోని అడమార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థ స్వామిజీ సోమవారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. శ్రీరాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పండిత కేసరి రాజా.ఎస్.గిరిరాజాచార్‌తో భేటీ అయ్యారు.



మూల బృందావనానికి హారతులిస్తున్న పీఠాధిపతి

ఏడాదిలో రూ.10.43 కోట్లు అందజేశాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి
- కుంటనహాల్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ నూర్‌బాషాకు సూచిస్తున్న ప్రదీప్ రెడ్డి

కౌతాళం: ఒక్క ఏడాదిలో కుంటనహాల్ గ్రామానికి రూ.10,43,11,000 నగదును ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల పేరుతో పంపిణీ చేసిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలం పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అందిన పథకాలు, చేకూరిన లబ్ధి గురించి వివరించారు. అలాగే.. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలని కోరారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ కుంటనహాల్ గ్రామంలో 2,250 ఓటర్లు ఉండగా ఏడాదికి రూ.10.43 కోట్లు మంజూరైందని, గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంత మొత్తం అందజేసిందా అని స్థానికులను ప్రశ్నించి సమాధానం రాబట్టారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అమోఘమన్నారు. వైఎస్సార్ చేయూత ద్వారా రూ.1.06 కోట్లు, జగనన్న చేదోడు నుంచి రూ.90 వేలు, అమ్మ ఒడి పథకం ద్వారా 1.47 కోట్లు, జగనన్న తోడు నుంచి రూ.1.30 లక్షలు, వైఎస్సార్ బీమా నుంచి రూ.6 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా నుంచి 97.33 లక్షలు, పంట నష్ట పరిహారం ద్వారా 3.25 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక నుంచి ఏటా రూ.1.79 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. అలాగే నాడు-నేడు, నూతన సచివాలయం నిర్మాణానికి, రైతు భరోసా కేంద్రానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ ఇదే తీరుగా సంక్షేమ ఫలాలు అందాయన్నారు. సంక్షేమ పాలనతో ఎంతో సాయం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఏఈ నూర్‌బాషాను కోరారు. తాగునీరు సరిగా రావడం లేదని వాటర్‌మేన్ విధులు సరిగా నిర్వహించడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇళ్లు కట్టుకున్న వాళ్లకు కాకుండా పాత ఇళ్ల ఉన్న వారికి హౌసింగ్ బిల్లులు వచ్చాయని, అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని చంద్రశేఖర్ ఫిర్యాదు చేశాడు. సమస్యల్ని వెంటనే పరిష్కారిస్తామని ఆయన సమాధానమిచ్చారు. ఎంపీపీ అమరేష్, ఉరకుంద ఈరన్న స్వామి ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచు పార్వతమ్మ, గ్రామ ఇన్‌చార్జి శివరాం, మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, నాయకులు ఏకాంబరరెడ్డి, వడ్డె రాము, హాల్వి చెన్నప్పధని, నదిచాగి రామన్నగౌడ్, పాండురంగారెడ్డి, సోమిరెడ్డి, వల్లూరు మరేగౌడ్, అబ్దుల్ సమద్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నగేష్, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఆదోని అర్బన్ : పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ ఆధ్యాత్మిక కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య తెలిపారు. సోమవారం ఉచిత కుట్టు శిక్షణలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థులు చేరారు. ఆయన మాట్లాడుతూ మహిళల కోసం ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయ్యిందన్నారు. ఇందులో గృహిణులు, యువతులు నాలుగు నెలలపాటు శిక్షణ తీసుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ, పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు 9247391549 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



మండిగిరిలో తన అభిప్రాయాలను నమోదు చేస్తున్న వృద్ధుడు



శంకరమఠం ఏరియాలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న దృశ్యం

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

ఆదోని టౌన్ : రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ 16వ వార్డు కౌన్సిలర్ తాయన్న, సచివాలయ కన్వీనర్ జిలేకాబీ అన్నారు. 'నువ్వే మా నమ్మకం జగన్.., జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా సోమవారం వార్డు పరిధిలోని బండిమెట్ట, హిందూ శ్మశానవాటిక ఏరియా, షేర్‌ఖాన్ కొట్టాల ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అలాగే.. 18, 19, 21, 04 వార్డుల్లో పర్యటించారు.

ఆదోని రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందజేస్తున్నారని, ఆయనను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం మనపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ పేర్కొన్నారు. సోమవారం మండిగిరిలోని తిరుమలనగర్, ఇంజనీర్స్ కాలనీలలో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వినోద్ రెడ్డి, సురేష్, రాజశేఖర్, చిన్నాయాదవ్ పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని రామచంద్రనగర్, రాఘవేంద్రనగర్, ఓల్డ్ టౌన్, లాడ్జింగ్ ఏరియా తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి , సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి ఉన్నారు.

డీటీపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : సమస్యలు పరిష్కరించని డిప్యూటీ తహసీల్దారు వీరేంద్రగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, తిక్కన్న డోలు హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ఆదోని రూరల్ : సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే మహిళ ఇంటి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఆమె నుంచి 41 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు

కౌతాళం: స్థానిక వైఎస్సాఆర్ సర్కిల్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, సర్పంచ్ పాల్‌దినకర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులు, వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి ఉపయోగపడుతుందన్నారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, కార్యదర్శి నాగరాజు, నాయకుడు ఉమాపతి పాల్గొన్నారు.

సరిహద్దు వద్ద తనిఖీలు ముమ్మరం

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏపీ సరిహద్దులోని మాధవరం చెక్‌పోస్టు వద్ద సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణంగా పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

సమస్యల పరిష్కారమే స్పందన ధ్యేయం

- శనివారంలోపు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



స్పందన కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ధ్యేయమని, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు.సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవిందసింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, మున్సిపల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

– ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామానికి చెందిన కురువ భూపాల్‌కు సంబంధించి సర్వే నంబర్ 31-బీ1-బీలో 0.90 సెంట్ల భూమి వారసత్వంగా సంక్రమించింది. ప్రస్తుతం తమ పక్కన పొలం వారు 0.18 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నారని, విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించాడు.

– గ్రామంలో ఆర్‌డీటీ సంస్థ వారు ఇల్లు లేని వారికి ఇంటి నిర్మాణం చేసి ఇస్తున్నారు. తమకు గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలను తీసుకొని నూతన పట్టాలను మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం జరుగుతుందని ఆదోని మండలం చిన్నహరివాణం గ్రామం ఎస్సీ కాలనీవాసులు విన్నవించారు.

– కోసిగి మండలం నేలకోసిగి గ్రామానికి చెందిన నరసింహులుకు సర్వే నంబర్ 123 పైకి 2.60 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశాడు.

– మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామానికి చెందిన హనుమంతమ్మకు నందవరం మండలం హాలహర్వి గ్రామంలో సర్వే నంబర్ 36/డీ 1బీలో 4.46 ఎకరాల భూమి ఆర్‌ఓఆర్,అడంగల్ నందు వేరే వారి పేరు ఉంది. విచారణ చేసి తమ పేరు నమోదు చేయాలని అర్జీ అందజేశారు.